హుషారుగా పరుగిడుతున్న ఎక్స్ప్రెస్ట్రెయిన్ గోదావరిబ్రిడ్జికొంచెం దూరంలోవుందనగా ఆగిపోయింది, ఎందుకు ఆగిందో కారణం ఎవరికీ తెలియదు. నేనున్న కంపార్ట్మెంటంతా పిల్లాపిచుకలతో నిండిపోయివుంది. ఏడ్పులతో- ఓదార్పులతో- పిలలఆటలతో- పాటలతో- కొందరుపెద్దల దెబ్బలాటలతో నానాగొడవగా వుంది.

# సుస్మితా రమణమూర్తి

# పది రూపాయల నోటు

పేపర్లో కూరుకుపోయిన కొన్ని బుర్రలు ఠక్కునలేచాయ్- రైలు ఆగినకారణం విచారించడానికి, రాజమండ్రి స్టేషన్లో దిగాల్సిన నాలాంటివారికి మాత్రం వెధవ ట్రెయిన్ అక్కడే వెళ్ళిఆగితే బాగుండునుకదా, అని చిర్రెత్తుకుపోయింది. రైలు ఆగినందుకో మరెందుకోగాని నిద్రాభంగమైన ఓపెద్ద అసామిఉరిమిఉరిమి చూడసాగేడెటో అనంతంలోకి ఎగిరిపోతున్న ధర్లిన్ని అందుకోలేని ఆర్డినరీ యల్డీసీలా దూరప్రయాణంతో అలసిసొలసిపోయిన కొందరు విసుక్కుంటూనే వున్నారు.

ఆగిందేదో ఆగిందికదాని కాలక్షేపంకోసం అక్కడే కొందరు పుణ్యాత్ములు(?) మొదలెట్టారు- హరికథలు! రాబోయే గోదావరిని గురించి- దాని ప్రశస్తతనుగురించి

సీరియస్‌గా చర్చసాగుతూంది. సభ్యతకోసం కొందరు శ్రోతలు బోరుకొట్టినా బుర్రలూపుతున్నారు.

ఎదురుగా వున్న పెద్దకడుపు పెద్దాయిన నన్నాకర్షించాడు. మరీ అరిందాలాగ హరికద్దాసులాగ చెప్పుకుపోతున్నాడు— అప్పుడప్పుడు నిర్లక్ష్యంగా వున్న నాలాంటి వాళ్ళవైపు 'నమిలి మింగేద్దామా' అన్నట్లు చూస్తూ. అతనికళ్ళలోకి సూటిగా చూడలేనినాకు అతనో పెద్ద సమస్యే అయ్యాడు.

"బాబూ! ఓపైసా ధరమం సేయండి! మూగ్రోజులున్నించికాసిన్ని గంజినీళ్ళయినా లేవు. సచ్చిపోతున్నాబాబూ! ధరమం సేయండి ధరమ పెబువులు సల్లగుండాల, ఒక్క పైసాబాబూ! మీకు పున్నెం వుంటాది.........!"

ముష్టివాడు ముష్టికోసం ముష్టిపైసాకోసం గొంతెండిపోయేట్టుగా— పేగులు కన్పించేట్టుగా అరుస్తున్నాడు, అప్రక్కనున్న వాళ్ళు మెడికోస్ కాబోలు! వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటూ గబగబా అతనిఎముకల్ని లెక్కపెట్టేస్తున్నారు. ముష్టివాడు పాపం.

అతను ఓమనిషే! అందర్లారెండు చేతులు— రెండుకాళ్ళు ఓనోరు— ఓముక్కు.............వున్న వాడే! తడుముకుంటూ నడుస్తూన్నాడు. దృష్టిసరిగా అనదేమో?

"బాబ్బాబు! ఒక్క పైసా!! నాకోక్కసం కాదు బాబు! నన్నునమ్ముకున్న పిల్లలకోసం!! ఒక్క పైసా యివ్వండిబాబు!" దీనాతిదీనంగా అడుక్కుంటున్నాడు!"

"ఏరా రాస్కెల్! కళ్ళుకన్పించటంలేదా ఏం?"— ఒకపెద్దమనిషి కళ్ళెర్రజేసి గర్జించాడు.

"సమించాల దొరబాబులు! దుస్టిసరిగి అనదుబాబు!" అంటూ ముష్టివాడు ఆపెద్దమనిషి కాళ్ళకు నమస్కరించడానికి వంగబోయాడు క్రిందికి "సరెసరిలే!" అని ఊరుకున్నాడతను.

"దొంగవెదవ! అంతా వట్టినాటకమండి! వీణ్ని నమ్మకండి! కనబడకపోవడమేమిటి? నిక్షేపంలా కళ్ళుంచుకుని. ఘోరాదొంగవెధవా! పో ఇక్కడుంచి. జాగ్రత్త సుమండీ మనసామాన్లు! ............"— మరో పెద్దమనిషి అందరివేపు చూస్తూ

అన్నారు! మీదయ బాబు! " అంటూ ముందుకు కదిలాడు ముష్టివాడు, మళ్ళీ టేపు వెనక్కి త్రిప్పి రికార్డర్ ఆన్‌జేశాడు,– 'బాబు! ఒక్క పైసా ధర్మం సేయండి!................"

"అలా ముందుకు పో బాబు!" – ఒక ఆసామి!

"పోవయ్యా! ఫో! వెధవ న్యూసెన్స్!!" — ఒక విద్యార్థి!

"గెటవుట్! రాస్కెల్!!" – ఓ బెల్‌బాటమ్!

రకరకాల ఛీత్కారాలు వివిధ శైలిలో లయబద్ధకంగా విన్పిస్తున్నాయ్. నిరాశా నిస్పృహలు అలముకుంటున్న అతని మొహం చూస్తే జాలేసింది వాళ్ళు అందరూ మూర్ఖులు. కరడుగట్టుకుపోయిన మనుష్యులు! ఒక్కరిలోను దయ, దాక్షిణ్యాలు మచ్చుకైనా లేవు. ఒట్టి స్వార్థపరులు నిర్దయగూటిలో తలదాచుకున్న పెద్దలు! వీళ్ళందరికీ బుద్ధివచ్చేట్లు చేయాలి. మూసుకుపోయిన కళ్ళు తెరిపించాలి! అతనూ మనిషేనని తెలియజేయాలి! అని నాలోనేనే వాపోయాను

పడుగుపందెంలో పడిపోయి లేచి మళ్ళీ పరుగు లంకించుకోబోతున్న విద్యార్థిలా ఏవరిప్రయత్నంలా నావేపొచ్చాడు ముష్టివాడు. ఫేంట్ జేబులో చేయిపెట్టాను. అతనికళ్ళలో ఓ చిన్న ఆశాదీపం తళుక్కుమంది. చిల్లరతగల్లేదు. షర్ట్‌జేబులో చూశాను, ఊహుఁ! చిల్లరలేదు. పోనీ ఓ రూపాయిస్తే!! అని అనుకున్నాను మరుక్షణంలోనే రూపాయేంజేసుకుంటాడన్న ప్రశ్న తలెత్తిందినాలో. పోన్లే ఈరోజైనా, నాపేరు చెప్పుకుని హాయిగా కడుపునిండా తింటాడు. అనుకుంటూ జేబులోని నోట్లను పైకితీశాను.

వాడిదురదృష్టమేమో. జేబులోనున్న కొన్ని పదిరూపాయలనోట్లు నన్ను చూసి ఫక్కున నవ్వాయ్! నా భృకుటి ముడిపడింది, పరిస్థితి చీకాకును కలిగించింది, ఎదురుగా వున్న పెద్దకడుపు పెద్దాయన నా అవస్థను గమనిస్తున్నట్లుంది, అందుకేనేమో నన్ను, ముష్టివాణ్ణి మార్చి మార్చి, చూస్తున్నాడు.

ముష్టివాడికి సహాయం చేద్దామన్న మనస్థితికి – ఏమీ చేయలేని పరిస్థితికి నామీద నాకే జాలివేసింది.

అసహ్యం కలిగింది. నేనుకూడా ఈ అభ్యాగతుణ్ణి నిరాశ పర్చవలసిందేనా? మనస్సు చివుక్కుమంది. అందర్నీతప్పుబట్టిననేను అదేపని చేయడం నాఅంతరాత్మ సహించలేకపోయింది. ఆత్మగౌరవం దెబ్బ తిన్నట్లన్పించింది. నాలోనేను బాధ పడుతున్నాను.

నామూగవైఖరిని చూసి, ఇక లాభం లేదనుకుని నిరాశగా ముందుకి కదలిపోయాడు ముష్టి వాడు. నాకుజాలివేసింది. కాని నాజాలి వాడికడుపునింపదు. అలా అని పదిరూపాయలు ఒక్కసారిగా ఇవ్వడానికి వెనుకంజ వేశాను. వాడలా నిరాశగా, నిస్పృహగా వెళ్లి కంపార్ట్మెంట్లో ఓ మూల కూర్చున్నాడు.

దరిద్రుడి ఆక్రోశంలా కయ్యి! మనికూసి బరువుగా బయల్దేరింది రైలు. మళ్ళీ ప్రయాణికుల్లో చలనం ఉత్సాహం చోటు చేసుకున్నాయ్. రైలుముందుకి పరుగిడుతుందో లేక చెట్టు చేమలు వెనక్కి పరుగులు తీస్తున్నయో అర్థంకాని సంధిగ్ధావస్థలో వున్న చిన్నపిల్లలు ఏడ్పు లంకించు కున్నారు.

రైలుగోదావరి బ్రిడ్జిని చేరుకుంటూంది అందరూ సర్దుక్కూర్చున్నారు. తమతమ వారందర్నీ నిద్ర నుండి లేపుతున్నారు కొందరు, ఒక్కొక్కటికి దగ్గర నలుగురేసి నించుని కళ్ళప్పగించి చూస్తున్నారు సమీపిస్తున్న గోదావరిని ఒరేబాబూ ఈ అయిదుపైసలు చేత్తోవుంచుకుని గోదార్లోపడేసి అతల్లికి దణ్ణంపెట్టుకో ఒతల్లి తన తనయుడికిచ్చిన ఉపదేశం!

ప్రతిఒక్కరు చేతిలో తమకు తోచిననాణెం పట్టుకుని సిద్ధంగా వున్నారు రైలు బ్రిడ్జి ఎక్కిండి–దడ దడశబ్దంచేస్తూ. చేతుల్లోని నాణాల్ని ఒక్కొక్కరూ గోదావర్లోకి విసరి కళ్లుమూసుకుని నమస్కరిస్తున్నారు నాఎదురుగా వున్న పెద్దాయన మెల్లోంచి అతిప్రయాసతో ఓ విచ్చు రూపాయితీశాడు భక్తివినమ్రతలతో దాన్నిగోదావర్లోకి మెల్లగా జారవిడచి కళ్ళు మూసుకుని మూతికదుపుతున్నాడు

ఈవైనాన్ని వింతగా చూస్తూ ముష్టివాడు గోదావరిలోకి ఆశగా చూస్తున్నాడు, 'ఒక్కసారి నదిలోకి దూకి అన్నిడబ్బుల్ని ఏరుకుని

పగలబడి నవ్వుదామా" అన్నట్లున్నాయ్ వాడిచూపులు. అంతలోనే వాడిముఖంలో నైరాశ్యం చోటు చేసుకుంది నిరాశతో కృంగిపోయిన వాడిముఖం- నిర్దయతో విర్రవీగే పెద్దాయన పాపపు ముఖంచూస్తే కడుపుదేవినట్లయింది, అప్రయత్నంగా కళ్ళుచెమర్చాయ్, "హు, మూఢనమ్మకం" నొక్కి పెట్టిన అక్షరాల్ని పెగల్చుకుంటూ వచ్చేసిందా శబ్దంపైకి.
ఎదురుగావున్న పెద్దాయన ఛెళ్ళున చెంపమీద కొట్టినట్లు చూశాడు. నాకు క్షణంభయం వేసింది.

"ఏమిటండీ మీరనేది? ఏది మూఢనమ్మకం? గోదావరితల్లిమీద ప్రయాణం చేస్తూ ఆతల్లికి ఒరూపాయిచ్చుకోడం మూఢనమ్మకమా??? రోజుకి లక్షన్నర అనవసరపు ఖర్చులు పెడుతుంటామే అందులోంచి ఒక్కరూపాయి ఆతల్లికి యిస్తే మనఆస్తిఏమైనా తరిగిపోతుందా? ఐనా ఈకాలంవాళ్ళకి పాపభీతి- పుణ్యచింతన అస్సల్లేవు విసుక్కుంటూ అన్నాడు.

"అదికాదండీ పుణ్యం. మోక్షం అంటూ ఏవేవోకార్యాలు చేస్తూండట డబ్బుదండుగ చేయడం ఎందుకు చెప్పండి, ఐనా నాకుతెలియకడుగుతాను ప్రతిమనిషి దేవుడు. దయ్యం అంటూ చేసేపనులన్నీ కేవలం పుణ్యం కోసమేనంటారా? ప్రతిమనిషి చేసేపూజల్లోను- పెట్టే దండాల్లోను కనీసం ఒక్కో డజనేసి కోర్కెలుండవంటారా? ఎవరికి తెలియనిదండి! ఈనాటి మనిషి స్వభావం! ప్రతిమనిషి దేవుని మహిమను లంచంతో తూస్తూన్నాడు ప్రతిమనిషి పాపాలు చేస్తుంటాడు కాబట్టే దేవుడంటే భయం. నమ్మకం గుక్క త్రిప్పుకోకుండా అనేశాను, ఏదో ఆలోచిస్తున్న అతనితో మళ్ళీ ఇలా అన్నాను.

"పాపాలంటూ చేయడంఎందుకు ఎవరికీ తెలియని కన్పించని దేవుణ్ణి తలచుకుని భయం చెందడం ఎందుకు? ఎక్కడోవున్న దేవుడికి ఇచ్చేకానుకులు అందుతాయోలేదోగాని ఎదురుగావున్న సాటిమనిషి చచ్చిపోతున్నా దయాదాక్షిణ్యాలు చూపలేని వాళ్ళంతా పుణ్యాత్ములు! దైవభక్తులు!! మనసంగతే తీసుకోండి. త్రాగడానికి గుక్కెడు గంజయినా లేకపేగులెండిపోతున్న అముష్టివాణ్ణి అసహ్యించుకున్నాం.

తననుభవిస్తున్న అక్షుద్బాధకి తను చేసిన తప్పేమిటో తెలియని, ఊహించలేని వాణ్ణి కనికరించక పోవడంమాని పైగా కసురుకున్నాం. వాడలా ఆమూల ఆకలితో మెలికలు తిరిగిపోతున్నా నిర్దాక్షిణ్యంగా వూరుకున్నాం,

"మీరిపుడు నదిలోవేసిన రూపాయిలో కనీసం పదోవంతైనా వాడికి వాడిలాంటి వాళ్ళకి దానంచేసి. వాళ్ళ ఆకలిమంటలు కొంచెమైనా తీర్చడానికి సహాయపడితే, అది కుంటే తప్పా? అవమానమా?? అగౌరవమా??? చెప్పండిసార్! చెప్పండి!!

"ప్రతిమనిషిలోను దేవుడు న్నాడని- మానవసేవయే మాధవ సేవని ప్రతిమనిషి గుర్తించగలిగితే ఎంతబావుణ్ణు! అలాజేస్తే ఎక్కడో వున్న ఆదేవుడు అందరికీదగ్గరై సంతోషిస్తాడు. సుఖసంతోషాలకు అన్నివిధాల నోచుకున్న మనలాంటి వాళ్ళుకూడా ఇంకా అంతులేని సుఖసౌకర్యాల కోసం ఆదేవుణ్ణి పూజిస్తూ కూర్చునేకంటే, కనీసం మనకుండే అవకాశాలులేని అసంఖ్యాకమైన వాళ్ళగురించి ఒక్కసారైనా ఆలోచిస్తేచాలు. మనలో మానవత్వ మున్నట్లే! మన కున్నంతలో మనపరిధిలో ఎవరినైనా ఆదుకోగలిగితే మనలో నిజంగా దైవత్వమున్నట్లే!! ఈవిషయం, అందరూ కాకపోయినా మీలాంటి వాళ్ళుఐనాగ్రహిస్తేచాలు

ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోయాను, వింతగా అందరూ నన్నే చూస్తున్నారు. అంటే అందరూ నేచెప్పింది శ్రద్ధగా విన్నారన్న మాట. అంతా ప్రశాంతంగావినిలాపాయింట్లుకోసం వెదుక్కుంటున్నట్లు ముఖంపెట్టి అందుకున్నాడు ఎదురుగావున్న పెద్దాయన

"అసలు మనదేశంలో 'బెగ్గర్స్' ఎక్కువ కావడానికి కారణం చెప్పకుంటారా?" అని ఒక్కక్షణం ఆగి అందరివేపు చూశాడతను. నన్ను చూసి చిరునవ్వు నవ్వుతూ, "మీలాంటివారే!" అన్నాడు,

అందరూ అతనుచెప్పిన రహస్యానికి ఫక్కున నవ్వుతూ తల లూపారు. నేనుక్షణం నివ్వెర పోయాను. అందరిముందు దోపిలా

తలదించుకున్నాను, మళ్లీ చెప్పడం మొదలెట్టాడతను.

"వాళ్ళకిలా మీలాంటి వారు మద్దతుయియ్యబట్టే బరితెగించుకు పోతున్నారు కూలిపనిచేసి సంపాదించుకునే శక్తిసామర్థ్యాలున్న వారుకూడా ఈవృత్తినే అవలంబిసున్నారు. ఇలాంటి వాళ్ళని మనం ప్రోత్సహిస్తూపోతుంటే కొంతకాలానికి మనదేశంలో మిగిలేది బెగ్గర్స్ మాత్రమే! ప్రభుత్వంవారు వీళ్ళ విషయంలో శ్రద్ధతీసుకుంటేనేగాని మనం బ్రతకలేం!" శ్రోతలందరికి అతనిమాటలు రుచించినట్లున్నాయ్ అంతా హర్షధ్వానంచేశారు.

"అంత ఇదిగావుంటే నీదగ్గరున్న పదిరూపాయల నోటుని దానం చేయకపోయావా?"— ఒపెద్దమనిషి హేళనతోకూడిన సలహా! మళ్ళీ అంతా నన్ను చూసినవ్వడం ప్రారంభించేరు మూలనున్న ముష్టివాడి వేపుపోయింది నాదృష్టి.

చినిగిపీలికలువారిన బనియన్ మాసినలుంగీ చిందరవందరగా వున్నజుత్తు ఏపుగా పెరిగిన మీసాలు గెడ్డం— పసులతోనిండిన చిన్ని కళ్ళు— ఆకళ్ళలోని దీనతనం వెన్నుకి అంటివున్న కడుపు—సన్నని పుల్లల్లాంటి చేతులు. కాళ్ళు—నిరాధారంగా నిలువలేని మనదేశానికి ప్రతిబింబంలా చేయూతగా తీసుకున్న ఒకర్ర— ఇదేవాడి అవతారం

ఇంతకుముందు కంటె వాడిమీద జాలిరెండింతలైంది ఇలాంటి వాడికిసహాయం చేయనిరాకరించిన పెద్దమనుషు లందరిమీద చెప్పలేనికోపం వచ్చింది. కాని నేనొక్కణ్ణి, ఏంచేయగలను! అపరివర్తన వాళ్ళంతట వాళ్ళకే కలగాలి.

పరుగెత్తి పరుగెత్తి అలసిపోయిన రైలు దాహం తీర్చుకోవడానికి రాజమండ్రి స్టేషన్లో బద్ధకంగా ఆగింది. ఆ ముష్టివాడికి సహాయం చేయమని అంతరాత్మ నన్ను హెచ్చరిస్తోంది. జేబులోని పదిరూపాయల నోటు తీశాను ముష్టివాడింకా అమాయకంగా, ఆశగా అందరికేసి చూస్తున్నాడు. అంతకన్న తనేం చేయగలడు? అతని కళ్ళలోని దైన్యం నన్ను ఊపివేసింది. అతని దైన్యస్థితికి గుండెతరుక్కుపోతూంటే ముందూ వెనుకా ఆలోచించకుండా పదిరూపాయలనోటు ముష్టివాడి

చేతిలో వుంచి, "తాతా! దీంతో నీక్కావలసింది కొనుక్కో. కడుపు నిండా తిను. కావాల్సినంత తిను." అన్నాను. అంతవరకు దైన్యంతో నిండిన అతని ముఖం ఆనందంతో వెలిగిపోయింది. నా మనస్సులో ఆనందం చోటుచేసుకుంది. రైల్లోంచి దిగేవాళ్ళంతా దిగుతూంటె ఎక్కే వాళ్ళంతాఎక్కుతున్నారు. కొందరు ఇటు అటు పరుగెడుతున్నారు.

నా సూట్ కేస్ తో కంపార్ట్ మెంట్లోంచి ప్లాట్ ఫాంలోకి అడుగు పెట్టాను. వెనుకనుంచి ముష్టివాని మాటలు విన్పిస్తున్నాయ్. "ఆదరమ పెబువులు. దరమాత్మలు ఎల్లేల్లు సల్లగా బతకాల.......................—

స్టేషన్ కి వస్తానన్న రాజు జాడ లేదు. అడ్రస్ ప్రకారం ఇల్లు కనుక్కోవడం కాస్తకష్టం. నేనేస్టేషన్ కి వస్తానని రాశాడుకూడా లేకుంటే ఎలాగోలా ఇల్లు వెతుక్కునేనాణ్ణి. అసలే రైలుప్రయాణం బోరు కొట్టిందేమో మరీ విసుగెత్తుతోంది. కొద్దిగా తలనొప్పి– దానికితోడు కడుపులో మరీ గరగర మంటోంది.

కొన్నినిముషాలు ఎదురు జూసి, ఏమితోచకుంటే కాలాక్షేపం కోసం హిగ్గిన్ బాదమ్స్ షాపుకి దగ్గరి నడిచాను దొంగ....దొంగ.... పట్టుకోండి బాబూ! పట్టుకోండి!! నాపది రూపాయలు........" 'ఇదొక న్యూసెన్సు!' అనుకుంటూ వెనక్కి తిరిగిచూశాను. పదిగజాలదూరంలో అదేముష్టివాడు అరుస్తున్నాడు, ఏమైయ్యుంటుంది చెప్మా?' అని అటే చూడసాగేను. ఓపదిమంది పరుగెత్తుకుంటూ వచ్చి ముష్టివాడి చుట్టూమూగారు.

"చెప్పరా! దొంగవెధవ! ఎక్కడ ఆపదిరూపాయలు? ఊ'!"–గర్జించిందో కంఠం!

"నేదుబాబు! నేదు!! నాను దొంగనుకాను! ఓదరమ పెబువులు దయతల్లి నాకిచ్చిన పదిరూపాయల నోటుని ఎవుడో నన్నుకొట్టేసి నాక్కెల్లి పోనాడు. యాడకెల్లి పోయాడో? ఎటెల్లిపోయాడో? నాకు తెలవదుబాబూ! అయ్యో నా పది రూపాయలు!......" కంఠంలో దైన్యం, గుండెల్నిపిండే వాడి ఆర్తి నా మనసుని కదలించివేశాయ్! నా ఆత్మాభిమానం దెబ్బతిన్నట్లన్పించింది అవమానం నాకే జరుగుతున్నట్లన్పించింది.

'ఎందుకు వాణ్ణలా బాధిస్తారు? వాడితప్పేదీ' లేదు. ఆపదిరూపాయలువాడికి నేనేయిచ్చాను. వాణ్ణి వదిలేయండి........అం దా మ ను కున్నానుకాని ఏదోశక్తి నాగొంతు నొక్కేసింది, అ ప్ర య త్నం గా అక్కడికెళ్ళాను "నోర్ముయ్‌వెధవా' అబద్ధాలుకూడానా? నాజేబులోంచి కొట్టేసి వాడెవడికో ఇచ్చేస్తావా? చెప్పు. ఇంతకీవాడెవడు? వాడికీ నీకుగల సంబంధమేమిటి? వాడెక్కడికెళ్ళాడు?

"వీడూ-వాడూ ఒక్కటేనండి. కూడబలుక్కుని ఇలాచేసుంటారు!" -ధర్మసూక్ష్మాన్ని వివరించిందో పండుతల, "నాకేటీతెలవదు బాబూ నన్నొగ్గేయండి. బాబ్బాబుమీకాళ్ళు పట్టుకుంటాను." అంటూ ముష్టివాడు వాళ్ళకాళ్ళు పట్టుకుంటున్నాడు సంజాయిషీ చెప్పుకుంటున్నాడు ఏడుస్తున్నాడు. ఆఏడుపు అక్కడి పెద్దలచిన్నచెవులకి విన్పించలేదు. కరడుగట్టిన వారిగుండెలు కరుగలేదు.

"వీడిలా ఎందుకుచెప్తాడూ!.... అంటూ ఒపెద్దమనిషి తనచేతికర్ర నెత్తాడు.

ఎంత అమానుషత్వం, వీళ్ళలో ఈషణ్మాత్రమైనా జాలి, నెనరూ లేవా? మానవత్వం మంటగలసిపోయిందా? సాటిమనిషిమీద కనీస పుకనికరమైనా చూపరేం? ఒంటిమీద ఖరీదైన బట్టలు లేనంత మాత్రాన వాడివంట్లో కూడా నీతి నిజాయితీలు లేవనుకుంటున్నారా? ఆపదలో వున్నవాడిని ఆదుకోకపోతే పోయింది మరెంత చిత్రవధకి గురిజేస్తారే? ఎంతటి కరుణా రహితులు! కర్కశ హృదయులు. కన్పిస్తున్న నిజాన్ని దాచివాణ్ణి కష్టాలపాల్జేయలేను నామూలంగా వాడు వాళ్ళ రాక్షసత్వానికిగురి కానివ్వను వీళ్ళకెలాగైనా బుద్ధి చెప్పాలి. ఆవేశంతో రెచ్చిపోతూ స్వగతంలా అనుకున్నాను.

"ఆగండి!" అంటూ ముష్టివాణ్ణి పట్టుకోబోయాను అంతే కళ్ళుబైర్లుకమ్మాయి. లోకంఅంతా చీకటైపోయింది. శరీరంపట్టుతప్పి తూలిపోసాగింది,

"రా మా! లే చి ఈ మం దు త్రాగు. ఊఁ!

"ఏంటి? నేనెక్కడున్నాను? ఎవరది? అమ్మా!........

"నెమ్మదిగా.... లే! .... అ॥ అ॥.. మెల్లగా లే! నేను రాజుని!"

"నేనిక్కడి కెలా వచ్చాను? అసలేం జరిగింది?"

"సరిగ్గా నేనొచ్చేసరికి నీవు ప్లాట్‌ఫాం మీద 'అమ్మా!' అంటూ పడిపోయావు. అవెధవ ధర్మమా! అని ఈరోజింత దెబ్బతగిలింది. వెధవలు! ముష్టివెధవలు! కాస్త అలుసిస్తే మననే మంటబెట్టేస్తారు."

"అవును.... అముష్టివాడు........ ఏమయ్యాడు? ఏమైందివాడికి??"

"వాడా! చచ్చాడు వెధవ! పోనీలె నువు విశ్రాంతి తీసుకో!"

"అ॥ నిజంగానా!?"

"అవును నిజంగానే చచ్చాడు, ఒక్క కర్ర దెబ్బతో గుటుక్కు మన్నాడు."

మరేం వినబడలేదు నాకు మనస్సంతా వికలమైపోయింది తలకు తగిలిన దెబ్బకన్నా గుండెకు తగిలిన గాయం బాధిస్తూంది.

నిజానికి నా ఆత్మతృప్తికోసం సాటిమనిషికి సహాయం చేద్దామని ఇచ్చిన అపదిరూపాయల నోటు అముష్టివాణ్ణి లా పొట్టన పెట్టుకుంటుందన్న సంగతి ముందే గనుక తెల్సుండి వుంటే అనోటుని వాడికిఇచ్చివుండే వాణ్ణికాను! రైల్లో నాముందు కూర్చున్న పెద్దాయనలా మిగిలిన ప్రయాణికుల్లా నేనుకూడా అముష్టివాణ్ణి అసహ్యించుకుని వుంటే– ఇప్పుడిలా ఇంత ఘోరం జరిగేది కాదు.

ఏది ఏమైనా నాసానుభూతి వాడి మరణానికి సిఫార్సు చేసింది అంటే సాటిమనిషికి సహాయం చేయడం తప్పు!

నేనిచ్చిన పదిరూపాయల నోటు కారణంగా వాడి అల్ప ప్రాణం అనంత విశ్వంలో అంతర్లీనమై పోయింది

ఇంతమంది అమానుషత్వం ముందు నా ఒక్కడి సానుభూతి ఓడిపోయింది.

హ్చు! నా పదిరూపాయలు!! ముష్టివాణ్ణి హతమార్చిండి!!

★ ★ ★